# కుక్క చచ్చిపోయింది

ఇంటి లోపల అంతటా నిశ్శబ్దంగా వుంది.

ఇంటి ముందర కూడా ఏ అలికిడీ లేదు.

వరసలో పచ్చగా నిలబడిన పూల మొక్కలు మాత్రం బృందగానం చేస్తున్న సుకవ్యల్లాగా వున్నాయి.

మనసు వూహాగానం చెయ్యకపోతే జీవితం ఇంకెంత శూన్యంగా వుండేదో. మనసు పూస్తున్న రంగులతో, పాడుతున్న నేపథ్య సంగీతంతో రజనికి రోజులు విసుగు విరామం లేకుండా గడిచిపోతున్నాయి.

పొద్దున్న పని పూర్తి అయింది.

వరండాలోకి వచ్చి కుర్చీలో కూర్చుంది!

ఒక్క క్షణం పాటు ప్రపంచం అంతా నిశ్శబ్దంగా అయినట్లనిపించింది.

అంతలో మనసు మళ్ళీ తన పని ప్రారంభించింది.

పక్క ఇల్లు ఖాళీగా వుంది నెల రోజుల నుంచీ.

వరండాలోకి వస్తే అంతా శూన్యంగా అనిపిస్తోంది.

పక్క ఇంట్లో చెట్లు ఎండిపోతున్నాయి. తలుపులు మూసే వుంటున్నాయి. ఎప్పుడు తెరుచుకుంటాయా అని ఎదురు చూస్తున్నట్లు నిశ్శబ్దం ఆ యింటి ముందు కాపలా కాస్తోంది.

పిల్లల నవ్వులు లేవు. ఆటల కేకలు లేవు.

నెల క్రిందటి దాకా ఎంత కాలక్షేపంగా వుండేది!

వరండాలోకి రాగానే రాధమ్మ నవ్వు పలకరించేది.

స్కూలు నుంచి వస్తూ వాళ్ళమ్మాయి గేటు తీసుకుని ముందు తమ ఇంటికే

వచ్చేది. గ్లాసుడు మంచినీళ్ళు తాగి ఒక జామకాయ తీసుకుని వెళ్ళేది. ఈ లోగా కబుర్లతో అరగంట గడిచేది. ఆ అరగంటలోనే రాధమ్మ ''ఉమా, ఓ ఉమా'' అంటూ ఆరుసార్లు పిలిచేది.

''వస్తున్నానమ్మా'' అంటూనే అరగంట గడిపేది ఉమ.

ఇంటికి వచ్చినట్లేగా, ఎందుకో ఆవిడకి అంత తొందర.

తల్లి ప్రాణమంటారు అందుకేకాబోలు, అట్లాగుంటుంది కాబోలు! తనకేం తెలుసు? ఎందుకు తెలీదు?

భగవంతుడు పిల్లల్ని ఇవ్వకపోయినా మనసు ఇచ్చాడు కదా. పిల్లల ఆటలూ వాళ్ళ నవ్వులూ చూస్తుంటే పాపల బుగ్గ మీద కన్నీళ్ళు చూస్తే గుండెలకి హత్తుకోవా లనిపిస్తుంది.

'నీకు నేమున్నానురా కన్నా! ఛీఛీ ఏడవకూడదు' అనాలనిపిస్తుంది. కానీ ఎవరికి ఎవరు?

అట్లాగ చేస్తే తల్లులందరూ తనని విడ్డూరంగా చూడరూ?

తనదంటూ ఒక పిల్లను పెంచుకుంటే... ఎక్కడో పుట్టిన చెట్టు అంటుతొక్క మన దొడ్లో పాతుకున్నట్లు....

మరి అది బ్రతికి అతుకుతుందా?

ఎవరున్నా లేకపోయినా తనకి ప్రిన్స్ వున్నాడు చాలు. పిచ్చి నాన్న! దాని రంగు, నిగనిగ, కంటి మెరుపు, చూపులో తెలివి ఏ కుక్కకి వుంది?

పక్క ఇల్లు ఖాళీగా వుండటం వాడికి నచ్చటంలేదు.

తలుపులవేపు చూస్తూ వుంటాడు.

ఉమ రోజూ బిస్కట్లు పెట్టేది.

మళ్ళీ ఆ తలుపులు తెరుచుకోవాలి.

ఒక సుధ లేదా రోజా లేదా ఓ బేబీ ఎవరో వస్తేకానీ తనకీ ప్రిన్స్‌కి తోచదు.

* * * *

ఒక రోజు, దాని తరవాత ఇంకో రోజు.... మరో రోజు.... ఇట్లాగ వొంటి మీదికి నలభై ఏళ్ళు వచ్చేశాయి అనుకుంది రజని వరండాలోకి వచ్చి ఆ కుర్చీలో కూర్చోగానే.

తరతరాలుగా ఎండకి వానకీ తట్టుకుని నిశ్చలంగా కనిపించే కొండలు గుర్తు వచ్చాయి. తను కూడా ఒక కొండ. కొండలకి పిల్లలు పుట్టవు. తను మనిషి కొండ. కళ్ళు తెరుచుకుని చుట్టూ చూసినట్లుగా చూసింది.

ఆకుల్ని మించిన పూలు పూసిన బోగన్విలా కొమ్మలు గాలికి బాగా వూగు

తున్నాయి. ఉయ్యాల లూగుతున్నాయ్... సయ్యాటలాడుతున్నాయ్.

నది ప్రవాహంలా నిముషాలు కదిలి పోతున్నాయ్.

పక్క ఇంటి తలుపులు ఇంకా మూసుకునే వున్నాయ్.

ఈ ప్రపంచం కూడా తలుపులు మూసుకుని నిద్ర పోతోంది.

ఈ ప్రపంచాన్ని చూస్తుంటే కోపంగా వుంది, చిరాకు వేస్తోంది.

నిన్న పనిమనిషి చెప్పిన సంఘటన విన్నప్పటినుంచి ఒంటరిగా కూచోటానికి భయం కూడా పోయింది, కోపంతో ఎవడొస్తాడో రానీ ఏం చేస్తాడో చూస్తాను అంటోంది మనసు.

పక్క వీధిలోనే.... సాయంత్రం వేళ.... భర్త ఇంటికి రాలేదింకా. ఎదురు చూస్తోంది ఇల్లాలు. చేతిలో పాల గ్లాసు ఎదురుగా మూడేళ్ళ పిల్ల. మారాం చేస్తూ పాలు తాగుతోంది. ప్రశ్నలతో వేధిస్తోంది తల్లిని.

భర్త ఆఫీసునుంచి ఇంటికి వచ్చాడు. భార్యవేపు చూసి పలకరంపుగా నవ్వి బాత్‌రూమ్‌లోకి వెళ్ళాడు.

''నాన్న వచ్చేశారు. కాఫీ యివ్వాలి. త్వరగా తాగమ్మా'' అంటోంది ఆవిడ.

అంతలోనే ఎదుట వచ్చి నిలబడ్డారు ముగ్గురు ఆగంతకులు.

మొహాలకి ముసుగులున్నాయ్. చేతిలో ఆయుధాలున్నాయి.

తెల్లబోయింది.... ఇదేమిటి? ఎవరు? ఎందుకు?

అంతలోనే....

''దొంగలు జాగ్రత్త!'' మనో కేంద్రం నుంచి హెచ్చరిక.

చప్పున పాపని దగ్గరగా లాక్కుంది.

''ఎవరూ మీరు? ఏం కావాలి?''

''మాట్లాడకు. ఆ నగలన్నీ ఇయ్యి....ఊ....త్వరగా.''

గొంతు దగ్గిరికి కత్తి తెచ్చి పెట్టాడొక ముసుగు మనిషి.''

చేతుల గాజులు మెల్లగా తియ్యటం మొదలు పెట్టింది.

''త్వరగా'' మెళ్ళో చెయ్యి పెట్టి గొలుసు తీసేశాడు ఇంకొకడు.

చేతి గాజులు ఇచ్చేసింది.

అదే సమయంలో బాత్‌రూంలోంచి బయటికి వచ్చాడు భర్త... తెల్లబోయాడు ఎదుట దృశ్యం చూసి.... ఒకడుగు ముందుకు వేశాడు.

భార్య ఆదుర్దా పడుతూ భర్తకి కంటితో సౌజ్ఞ చేసింది వెళ్ళిపొమ్మని.

ఒక చోటెక్కడో అడ్డు వచ్చిన భర్తని కత్తితో పొడిచేశాడుట..... అతడు బాత్‌రూమ్‌లోకి వెళ్ళి తలుపు చాటున నిలబడ్డాడు.

నగలన్నీ ఒలుచుకుని వాళ్ళు వచ్చినట్లే మాయమయ్యారు.

బాత్‌రూమ్‌లోంచి భర్త వచ్చాడు. ఆవిడ ఫెయింట్ అయింది. భార్యని గుండెకు హత్తుకుని ''ప్రాణాలు దక్కాయి చాలు'' అన్నాడు భర్త.

అది నిన్నటి సంఘటన.

ఒక్కొక్క చోట ప్రాణాలు కూడా దక్కటం లేదు. మానభంగాల సంగతి అడక్కూడదు.

ఏమిటీ అన్యాయం? ఏమిటీ పరిపాలన? దౌర్జన్యాన్ని అరికట్టేవాళ్ళు లేరా?

ఇంత రక్షణ సిబ్బంది, పోలీసు బలగం వున్నాయి.

ఆధునిక ఆయుధాలు పరికరాలు వున్నాయి.

దేశరక్షణ కోసం మంత్రులు, ఆఫీసర్లు వాళ్ళకి బోలెడంత జీతాలూ ఇంకా ఎన్నెన్నో వున్నాయి.

ఐనా పట్టపగలు పౌరుల్ని బందిపోట్లు దోచుకుంటుంటే అడిగేవాడు ఆదుకునేవాడు లేడు.

ఎందుకీ పోలీసుదళం... ఎందుకీ ఎలక్షన్లు?

ఎంత కష్ట పడాల్సి వస్తోంది డబ్బు నిలువ చెయ్యటానికి?

''మీకేం పిల్లలా జెల్లలా?'' అంటారు.

ఇటు తనవైపు వాళ్ళకి, అటు ఆయనవైపు వాళ్ళకి తమ డబ్బు మీదే ఆశ. తరచూ వచ్చి పోతూ వుంటారు. మర్యాదలకి ఏ కొంచెం లోటు వచ్చినా సహించలేరు. పైగా ఆయన సంపాదనంతా ఏమైపోతోంది అంటారు.

ఈనాడు ఏ వస్తువు ధర తక్కువగా వుంది?

జబ్బులపాలు గాకుండా సరైన భోజనం చెయ్యాలంటే సంపాదన ఇంటి అద్దెకి తిండికి సరిపోతోంది. పిల్లలు గల వాళ్ళేం చేస్తున్నారోనని తను ఆశ్చర్యపడుతూనే వుంటుంది. ఈ గాజుల జత చేయించటం కోసం, నెలకి ఇరవై చొప్పున చిట్‌ఫండ్ కట్టి మూడేళ్ళు కూడబెట్టింది... అదీ ఐదేళ్ళ క్రిందట గనక... చేయించుకో గలిగింది. ఇది పోతే మళ్ళీ ఇప్పుడు చేయించుకోగలదా?

గొలుసు పెళ్ళికి చేయించారు నాన్న.... ప్రావిడెంట్ ఫండ్ లోన్‌లోంచి డబ్బు

తీసి. ఎవడైనా వచ్చి లాక్కుపోటానికి వాడికేం హక్కుంది?

తిండిలేక, ఉద్యోగాలు లేక బందిపోటులు తయారవుతున్నారంటారు. దానికి బాధ్యత ప్రభుత్వంది కానీ ప్రజలేం చేస్తారు? నిరపరాధులు! వాళ్ళే ప్రభుత్వం చేతిలో నలుగుతున్నారు.

ప్రజలమీదనా తమ కక్ష సాధించటం? మూల్గే నక్క మీద తాటి పండు పడ్డట్టు.

ఇది ఇట్లాగ చూస్తూ ఊరుకోవటమేనా?

మైట్ ఈజ్ రైట్ అన్న ఆదిమ మానవుల దశకి చేరుకుంటున్నామా మళ్ళీ. దొంగలు దోచుకుంటుంటే ఎవరూ సాయం రారు. ఎవరి ప్రాణం వారికి తీపి.

పోలీసులకి ఫోన్ చేస్తే ఈ స్టేషన్ మీ ఏరియాలో లేదు అంటారు.

ఏం జరిగినా చూస్తూ ఊరుకోవటమేనా?

ఇంతకంటె అడవిలో వుండటం నయం... మన జాగ్రత్తలో మనం వుంటాం.

ఎంత నిస్సహాయత? ఇట్లాగ వుండకూడదు... వుండకూడదు....

మరి ఎట్లాగుండాలి?

ఆలోచనలో పడిపోయి కళ్ళు మూసుకుంది రజని... మనసు రంగు రంగుల ఊహాలోకం చిత్రించటం ప్రారంభించింది.

తనొక గుర్రం మీద వుంది. నడుముకి కత్తి, తూటాలు. చేతిలో పిస్టల్, భుజానికి విల్లు, గుర్రం పట్నపు రోడ్ల మీద పరుగు పెడుతోంది. రోడ్లన్నీ నిర్మానుష్యంగా వున్నాయ్.

''పిరికివాళ్ళ లాగ ఇళ్ళలో దాక్కోకండి. బయటికి రండి. ఆత్మరక్షణే కాదు. సామూహికంగా ఒక్కటై ఎదిరించటం నేర్చుకోండి. ఈ ప్రభుత్వం ఏం చెయ్యలేదు. ఓట్లు అడుక్కోవటం, పన్నులు వసూలు చేసుకోవటం మాత్రమే తెలుసు దానికి. ప్రజల అవసరాలు నెరవేర్చటం తెలీని పనికి మాలిన ప్రభుత్వం ఇది. భక్షించటం తప్ప రక్షించటం తెలీని... మనల్ని మనమే రక్షించుకోవాలి...''

అందరూ ఇళ్ళలోంచి బయటికి వస్తున్నారు. ఏదో ఒక ఆయుధం ధరించారు. స్త్రీలు గుర్రాలెక్కి పహారా ఇస్తున్నారు. ఆనందం ఉత్సాహం ధైర్యం పొంగి పోతున్నాయ్.

పకడో...మారో అంటూ కేకలు... కేకలు.. ముసుగు మనుషులు పారిపోతున్నారు..

చటుక్కున కళ్ళు తెరిచింది రజని... ఫ్రిన్స్ గేటు దగ్గర నిలబడి మొరుగుతోంది. పక్క ఇంటి గేటు తీసుకుని లోపలికి వెడుతున్నారు... భార్యా భర్తలు కాబోలు. ఆయన తాళం తీస్తున్నారు... మూసిన తలుపులు తెరుచుకున్నాయ్...

ఇద్దరూ లోపలికి వెళ్ళారు... నిశ్శబ్దం బయటికి పారిపోయింది.

లోపల నుంచి చప్పుళ్ళు మాటలు వినిపిస్తున్నాయ్.

ఐతే వీళ్ళు వచ్చేస్తున్నారన్న మాట... ఎప్పుడొస్తారో?

''రెండు గ్లాసుల మంచినీళ్ళిస్తారా?'' ఆవిడ మధ్యగోడ ద్గర నిలబడి అడుగుతోంది.

''తెస్తానుండండి....'' గబగబ లోపలికి వెళ్ళి తెచ్చి యిచ్చింది.

మాటలు సాగాయి. ముగ్గురు పిల్లలు. ముచ్చటగా ముగ్గురు కాబోలు.

చిన్నప్పుడు బొమ్మలాట లాడేవారు. ఎప్పుడూ తన బొమ్మకి 'కృష్ణ' అనే పేరు పెట్టేది. బొమ్మల పెళ్ళి చేసేవారు. ఎవరింటికి వాళ్ళు వెళ్ళాక తను ఒంటరిగా వున్నప్పుడు యశోద అయ్యేది. కృష్ణుడికి తల్లి అయి కృష్ణ లీలలన్నీ ఆడేది.

మట్టి తిన్నావా? నోరు చూపించు!

ఏమిటీ మాయ? పసివాడి నోటిలో పధ్నాలుగు భువనాలా? తండ్రీ... నమస్కారం... ఈ దృశ్యం నేను భరించలేను... నువ్వు నా చిన్నారి కృష్ణుడివై నా వొళ్ళోకి రా! నీకు జోల పాడతాను.

వెన్నంతా ఏమయింది కృష్ణా? దొంగిలించావా? వుండు నీ పని చెప్తా....

ఈ చెట్టుకి కట్టేస్తాను.

ఎన్నో ఆటలు... గుండెలనిండా వాత్సల్యం పొంగులు.

ఆయన చూపులకి వచ్చి పిల్ల నచ్చిందన్నారు. పెళ్ళి జరిగింది. ఏళ్ళు గడిచాయి. పిల్లలు మాత్రం పుట్టలేదు. వాత్సల్యం ఎంత వెర్రిగా చిందు లేసినా వెన్నదొంగ తన ఇంటికి రాలేదు. ఎదురు చూసి చూసి ఆశ అణగారి పోయింది.

''మళ్ళీ పెళ్ళి చేసుకో'' అని సలహాలు ఆయనకి.

''పోనీ చేసుకోండి'' అంది తను కూడా సగం బాధ సగం ఉక్రోషంతో.

''నీక్కూడా మతి పోయిందా? ఇదేం బొమ్మలాటా?'' అన్నారు.

మనసులో అనురాగం సముద్రమైంది.

తనకి పిల్లలు అక్కర్లేదు... ఈన చాలు.

బొమ్మలాటే నయం. మనం ఇష్టం వచ్చినట్లు ఆడుకోవచ్చు.

జీవితం అట్లాగ కాదు. మనని శాసిస్తుంది. లొంగదీస్తుంది. నిస్సహాయుల్ని చేసేస్తుంది. తనకింక పరవాలేదు. ఎవరూ అక్కర్లేదు.

ఆయన తనని దూరం చెయ్యడు... తనకి దూరం కాడు.

అతడే తన కృష్ణుడు. బాలకృష్ణుడు... మోహనకృష్ణుడు...గీతాకృష్ణుడు.

అతడిలో కృష్ణుణ్ణి చూసినప్పటినుంచి తనకి కన్నీళ్ళు లేవు, నవ్వుల రువ్వులే కానీ.

''ఎందుకు రజనీ నీకు నవ్వు వస్తుంది ఎప్పుడూ'' అనేది రాధమ్మ.

నవ్వు అనేది ఆనంద మనే పువ్వు విసిరే పరిమళం.

అతడిలో కృష్ణుణ్ణి చూసినప్పటినుంచి తనకి కర్తవ్యమే తప్ప సమస్యలు లేవు.

ఆవిడ ఎప్పుడు లోపలికి వెళ్ళిందో... వచ్చి గ్లాసులు ఇచ్చింది.

''ఎల్లుండి వస్తున్నాం ఇంటికి. వెంటనే బాంబే వెళ్ళాలి. కొత్త ఇల్లు వదిలి వెళ్ళటం ఎట్లాగా అని బెంగగా వుంది. కాస్త మా ఇల్లు కూడా మీరే చూడాలి'' అంది.

''ఏం భయం లేదు. చూస్తాం. మా ప్రిన్స్ వున్నాడుగా. తెలిసినవాళ్ళెవరూ ఈ చాయలకి రారు'' అంది ఆవిడతో.

వచ్చేస్తున్నారుట! రండి... త్వరగా వచ్చెయ్యండి. ఈ నిశ్శబ్దాన్ని తరిమెయ్యండి... అంటోంది మనసు.

* * * *

రాత్రి గడిచింది.

ఇంక భయం లేదు అనుకోటానికి లేదు... ఈ కాలం పగలు కూడా భయమే. ఏ మనిషిని చూసినా భయమే. నలుగురు కలిసి వస్తున్నా భయమే.

మన దేశంలో మనం కాందిశీకుల్లా బ్రతుకుతున్నాం.

సూర్యుడు పైకి వస్తున్నాడు. ఆకులన్నీ పచ్చగా మెరుస్తున్నాయి. ప్రిన్స్ ఎండలో పడుకున్నాడు. వాడి జుట్టు నిగనిగలాడుతోంది.

తన కుర్చీ ప్రిన్స్‌కి దగ్గరగా వేసుకుని కూర్చుంది రజని.

వంట గదిలో వున్నంతసేపూ ముందు వైపే ధ్యాస... పక్క ఇంటిమీద.... ఏ చిన్న చప్పుడైనా అనుమానమే... ఎవరూ ప్రవేశించలేదు కదా అని.

పక్క ఇంటి కొత్త స్నేహితురాలి పిల్లలు కృష్ణయ్యలు కారు. నరకాసురుళ్ళ లాగున్నారు. ముద్దు వచ్చే అల్లరి కాదది. ప్రిన్స్ మీదికి రాళ్ళు వేస్తారు.

వాళ్ళకి లేని వస్తువు లేదు. భర్త రెండు చేతులా సంపాదిస్తాడు.

కారు, ఫ్రిజ్, నగలు, బీరువాలు, రత్న కంబళాలు... నల్ల బజారంతా ఆ ఇంట్లోనే వెలిగిపోతోంది.

దొంగలు పడితే అక్కడే పడాలి.

అందుకేనా అంత భయం? ఎంత భయం? ఎంత మమకారం వుంటే అంత భయం. అన్నీ తన కప్పగించి వెళ్ళిందావిడ. నిజంగా కాపాడగలదా... ఎవరేనా వస్తే, పోతే పోనీ...కష్టార్జిత మేమీ కాదు. అంతా ఈజీ మనీయే!

బందిపోటుతనం చేసి ఆ డబ్బంతా ఏం చేస్తారో?

నిజంగా తమ పొట్ట కోసమా?

ఊహు నిజంగా ఆకలి తీర్చుకోడానికైతే ఇంత ధైర్యం, సాహసం రావు.

సగం ఆకలి...సగం కసి... ఆకలిమంటలు రగిల్చిన కసి. అన్యాయంపై పగ! తను సుఖంగా వుండకపోతే ఈ ప్రపంచంలో ఎవరూ సుఖంగా వుండటానికి వీల్లేదు.

దోచుకుంటున్నారు సరే... ఆ డబ్బంతా ఏం చేస్తున్నట్లు?

బీదలకి పంచి పెడుతున్నారా? వాళ్ళే భాగ్యవంతులై మళ్ళీ అర్భకుల్ని పీడిస్తుంటారా?

ఇక్కడ దోచి ఎక్కడో పూడిస్తే సమానత్వం సిద్ధిస్తుందా?

ఈ దోపిడీలకి అసలు ఒక సిద్ధాంతం వుందా?

అక్రమాలు పోవాలంటే అన్యాయాలు వుండకూడదు.

అన్యాయాలు జరగకుండా వుండాలంటే సమానత్వం కావాలి.

సమానత్వం రావాలంటే డెమోక్రసీ వుండాలి.

డెమోక్రసీ నిలవాలంటే జనం చదువుకుని వుండాలి.

అయ్యో! స్వతంత్రం వచ్చిననాడు మనం ఎలుగెత్తి చాటిన మొదటి స్లోగన్ ఇదే కదూ. ఈ ముప్పై ఏళ్ళూ ఏం చేశావు దేశమా?

అయ్యో జనతా! ఎప్పుడు అక్షరాలు నేరుస్తావూ?

ఎప్పుడు బుద్ధిమంతుడి వౌతావు? ఎప్పుడు పరిపాలన చేస్తావూ?

ఎప్పుడు సుఖాన్ని పండించి సంతోషాన్ని పంచి పెడతావూ? ఎప్పుడు?

ఇప్పుడు...

అంతా చెప్పేవాళ్ళే కానీ వినేవాళ్ళు లేరు.

ఆజ్ఞాపించేవాళ్ళే కానీ ఆచరించేవారు లేరు.

అంతా పల్లకీ ఎక్కుతామనే వారే కానీ మోసేవారు లేరు.

జెట్ లాగ అందరూ ఎక్కి కూచున్నా ఎవ్వరూ మొయ్యకుండానే అతి వేగంగా ప్రయాణం చెయ్యగల ప్రభుత్వ యంత్రాంగం ఏదైనా వుందా?

అప్పుడు ఒక్క స్క్రూ వొదులైనా జెట్ నేలకూలి అంతా మరణిస్తారు కాబోలు!

ఒకరు మోసిన సుఖం మనకి వద్దు.

మోస్తే అందరం మోద్దాం దేవుడి ఊరేగింపు లాగ.

లేకపోతే కదలకపోయినా సరే అందరం ఎక్కి కూచుందాం!

హహ్హాహ్హా... ఇప్పుడు అట్లాగే వున్నట్లుంది పరిపాలన... హహ్హాహ్హా...

ఎందుకంత నవ్వుతావూ అనేది రాధమ్మ....

ఏం చెయ్యనూ, ఇవన్నీ నీకు చెప్పలేను రాధమ్మా.

నా ఆలోచనలకి నాకే నవ్వు వస్తుంది. నా ఆలోచనలకి నాకే ఏడుపు వస్తుంది.

నేను స్పందించే మనసున్న మామూలు మనిషిని.

ఎన్నెన్నో చెయ్యాలని ఊహలున్నా కాలు గడప దాటని మామూలు మనిషిని.

ఎవరో వస్తారు ఏదో చేస్తారని ఆశపడే మామూలు మనిషిని.

ఇక ఇంతే....అని నిరాశలో క్రుంగిపోయే మామూలు మనిషిని....

మెల్లమెల్లగా రజని ఆలోచనలు దాటి ఊహా లోకంలోకి జారుకుంది.

నల్లని ఆకాశంలో నక్షత్రాలు మెరిసిపోతున్నాయి.

అంతటా నిశ్శబ్దం. ఊపిరి నలపనివ్వని నిశ్శబ్దం.

అనంతంగా నిరీక్షిస్తున్నట్లు అనుభూతి. ఆ నిశ్శబ్దాన్ని చీలుస్తూ ఎక్కడో చిటుక్కుమంది.

రజని అటు చూసింది. ప్రిన్స్ కూడా అటు చూసింది మెడసాచి, చెవులు నిక్కబొడిచి.

ప్రిన్స్ ఇప్పుడు నాలుగడుగుల ఎత్తు నందిలా వుంది.

ఒకటి.. రెండు.. మూడు.. నలుగురు.. వచ్చేస్తున్నారు! వాళ్ళు వచ్చేస్తున్నారు చేతిలో రైఫిల్స్, కళ్ళకి గంతలు. సరాసరి పక్క ఇంటిలోకి వెళ్ళారు.

ఒకడు బయట నుంచున్నాడు. ఇంకొకడు తాళం తీశాడు. ఇద్దరు లోపలికి వెళ్ళారు. సామాన్లు కదులుతున్నాయ్. చప్పుళ్ళు.. కదలికలు.. దోచేసుకుంటున్నారు.. దోచుకోనీ.. దోచుకుపోనీ.. అంతా అన్యాయార్జితమే.

ఊహు! తనకి అప్పగించారా ఇల్లు. చూస్తూ ఊరుకోలేదు. ఫోన్ చేసినా పోలీసులు రారు. వచ్చినా అప్పటికి దొంగలు తమ పని పూర్తి చేసుకుని వెళ్ళిపోతారు.

వెళ్ళాలి! వాళ్ళ ఎదుటపడి ఇది అన్యాయం అనాలి.

అడిగేవాళ్ళు లేకనే ఈ దొంగతనాలు దోపిడీలు. అడిగితే ఏం జవాబుస్తారు? అడిగేస్తాను. ఒక ఇల్లు దోస్తే మీకు ఏమొస్తుంది? బ్రతుకంతా గడిచిపోతుందా?

ఐతే నా నగలన్నీ ఇచ్చేస్తాను.

ఇట్లాగ దేశం మీద పడి ప్రజల్ని దోపిడి చేస్తే సమానత్వం సిద్ధిస్తుందా?

హామీ ఇవ్వండి! ఈ దేశంలో ప్రతి స్త్రీ దగ్గరవున్న బంగారాన్నంతా మీకు ఇప్పిస్తాను! అడుగుతాను. అడిగి తీరుతాను. ఏం జవాబు చెప్తారు?

రజని లేచింది. గోడ అంత ఎత్తు ఎదిగినట్లుగా వుంది. చేతులు కత్తులుగా మారినట్లుచూపులు కార్చిచ్చు కక్కుతున్నట్లుగా వుంది.

ఒక అడుగు వేసింది. భూమి వణుకుతోంది! మరొక అడుగు..

రజని ఉలికి పడింది. నల్లని పరదాలు జారిపోయాయి. వర్ణ చిత్రాలు చెరిగి పోయాయి.

ప్రిన్స్ నిలబడి మొరుగుతోంది. తను కుర్చీలోనే కూర్చుని వుంది.

ఎవరో ఇద్దరు మనుషులు లక్ష్య పెట్టకుండా లోపలికి వచ్చేశారు. ఒకడు అక్కడే ఆగిపోయాడు. రెండవవాడు రజనికిదగ్గరగా వచ్చేశాడు. కత్తిపైకితీశారు. రజని కూచునేవుంది.

''మేడమ్... ఆ గొలుసు ఇలా ఇస్తారా?'' అతడి చేతిలో కత్తి తనకి దగ్గరగా వస్తోంది.

అకస్మాత్తుగా ప్రిన్స్ వాడి మీదపడింది. కత్తిఎగిరిపోయింది. వాడిని కరిచింది. రెండవ వాడిమీదకి దూకింది. ఇద్దరూ గేట్‌వైపు పరిగెత్తారు. ఇంకా వాళ్ళని వెంబడిస్తోంది ప్రిన్స్.

రజని ఊపిరి పీల్చుకుంది .. అమ్మో దొంగలు నిజంగా దొంగలు!

షబాష్ ప్రిన్స్! దొంగ వెధవలు అష్టవంకర్లు తిరిగి పారిపోతున్నారు.

షబాష్ నా కొడుకువైనందుకు గర్వంగా వుంది!

ప్రిన్స్ మెట్ల కింద నిలబడింది. గర్వంగా.. విజయగర్వంతో.. కాంతితో వెలిగిపోతోంది. వీళ్ళని అణిచేవాళ్ళు లేకనే....

ఎదిరించేవాళ్ళు లేకనే అన్యాయం విజృంభించింది.

ఎదిరిస్తే ఎవరూ నిలబడలేరు.

చలిచీమలచేత చిక్కి చావదె పెనుపాము!

నీటి కణాలు కలిస్తే వరద వాగులై ముంచెత్తుతాయి.

ప్రెషర్ రావాలి... ప్రెషర్ కావాలి.

మళ్ళీ ఏమిటా చప్పుడు... రెవాల్వర్ చప్పుడు... అయ్యో పారిపోయి గేటు దగ్గిర ఆగి వెధవ.. రెవాల్వర్ పేల్చాడు. ప్రిన్స్ ఒరిగిపోతోంది... అయ్యో!

రజని పరిగెత్తుకు వెళ్ళింది. రక్తానికి కళ్ళు చెదిరిపోతున్నాయి.

ప్రిన్స్ దగ్గర కూలిపోయింది.

అయ్యో ప్రిన్స్.... నా ప్రిన్స్.... ఆ కళ్ళలో ఇంకా ఆ గర్వమే.... ఇంకొకరికి

ఉపయోగపడ్డానని ఆ వెలుగు. ప్రిన్స్ దొంగల్ని చూసి తోక ముడుచుకోలేదు. నువ్వు... నీ డ్యూటీ నువ్వు చేశావు.. నీ యజమానురాలికోసం..నాకు దుఃఖంగా వుంది ప్రిన్స్...ఇంత దుఃఖం లోనూ గర్వంగా వుంది. నీ షివల్రీ చూసి గర్వంగా వుంది. మనుషుల్లో చచ్చిపోయినా ఇంకా నీలో వుంది. అందుకేనన్ను రక్షించావు. నన్ను రక్షించటానికి నీ ప్రాణాలు బలి ఇచ్చావ్...

ఎలాగతెలిసిందో.. అందరూ వచ్చేసున్నారు... ఎదురిళ్ళలోంచి, ఆ పక్క ఇళ్ళలోంచి. అప్పుడెవరూ రాలేదు. ఇప్పుడు ఎక్కడెక్కడి నుంచో ఎవరెవరో... వచ్చేస్తున్నారు.

''దొంగని కరిచేసిందిట కుక్క.''

''నగలు సామాన్లేవే పోలేదుట.''

''కుక్క దొంగల్ని పట్టేసిందిట!''

''ప్రిన్స్ కుక్క కాదు, నా కొడుకు. మీరంతా వెళ్ళిపోండి. నన్ను మనసారా ఏడవనివ్వండి. మీరంతా వెళ్ళిపోండి. చూశారుగా, కుక్క చచ్చిపోయింది. ఇంక వెళ్ళండి. ఏం ఊరేగిస్తారా? వెళ్ళండి, రథం తీసుకురండి'' అట్టహాసం చేస్తోంది మనసు.

ఎవరో రజని భుజం మీద చేయి వేశారు.

''ఎంత గండం గడిచింది!''... రజని వినిపించుకోలేదు. ప్రిన్స్‌నే చూస్తోంది.

రక్తం కారుతోంది ప్రిన్స్‌లోంచి.

రెండేళ్ళనించీ పెంచి గూడుగట్టిన మమకారం చివరికి కారిపోతోంది.

నీకూ నాకూ ఋణం తీరిపోయింది ప్రిన్స్... నువ్వు వెళ్ళిపోతున్నావ్... నీ ప్రాణాలు బలి ఇచ్చి గర్వంగా వెళ్ళిపోతున్నావ్... నాకేం మిగిలింది... బాధ... మనసులో శూన్యం... ఏం మిగిలింది... ఈ పిచ్చి బంగారం...

రజని రెండు చేతుల్ని దగ్గరగా చేసి చూస్తోంది. ఎండలో బంగారం తళతళా మెరుస్తోంది.

''మీ వారికి ఫోన్ చేశాం. ఆయన వస్తున్నారు. మీరు లోపలికి పదండి ముందు... కుక్క చచ్చిపోయింది.'' అందొకావిడ రజనికి చేయూతనిస్తూ.

రజని లేచి లోపలికి వెడుతోంది. వెళ్ళలేక వదలలేక వెడుతోంది.

'ఔను కుక్క చచ్చిపోయింది. మనిషిలో విశ్వాసం చచ్చిపోయింది. విశ్వాసానికి అంతిమ యాత్రఊరేగించండి. మనిషిజంతుదశను దాటిపోయాడు. ఒకప్పుడుసాంఘికభద్రతకోసం నీతి నియమం పెట్టుకున్నాడు. కొన్నాళ్ళ సాగింది. ఇప్పుడు సాగటంలేదు. విశ్వాసం, నీతి, నియమం మనిషికి బ్రతుకునివ్వటంలేదు. బలి తీసు కుంటున్నాయ్. అందుకని మనిషి వీటికి అతీతు డై పోతున్నాడు.. నీతి నియమం తెంచేసి పారిపోతున్నాడు. ఈ మనిషికి ఇప్పుడేది దిక్కు... ఏది దిక్కు? ఏది దిక్కు?' అంతరాళంలో ఘోష... ఆకాశాన్ని అంటుతున్నట్లుగా వుంది రజనికి

* * * *